
కథ

# తనదాకా వస్తే...?

డా॥ ద్వా.నా.శాస్త్రి



"ఆ నీలం రంగు అమ్మాయిని చూశావా" విహారి అడిగాడు.

"చూశాను"

"ఆ అమ్మాయి గురించి నీ ఉద్దేశం ఏమిటి?"

"పరిచయంలేని అమ్మాయిని గురించి ఏం చెప్తాన్రా?"

"అదే మరి, నీకూ నాకూ డిఫరెన్స్. ఫ్రాయిడ్‌ను చదవాలోయ్. అప్పుడు స్త్రీలను చదువుతావ్. ఇదొక మానసిక శాస్త్రంలే" మహా ఫోజుగా అన్నాడు విహారి.

"ఇంతకీ ఏమిటంటావ్" అన్నాను.

"ఏముందీ...ఇందాకటి నుంచి అబ్జర్వ్ చేయటం లేదా? పమిట జారకపోయినా జారవిడిచి మళ్ళీ సర్దుకుంటోంది. తన ఎద సంపదను అందరూ చూడాలన్నమాట. లూజ్ క్యారెక్టర్ అనడానికి చిన్న సాక్ష్యం అనుకో" తానేదో గొప్ప సత్యం కనుక్కొన్నంతగా సంబరపడ్డాడు.

విహారీ, నేను కొత్తగా కాలేజ్‌లో లెక్చరర్లుగా చేరాం. ఇద్దరమూ తెలుగులో డాక్టరేట్‌లు పొందినవాళ్ళమే. డిపార్ట్‌మెంట్‌లో విహారి వుంటే చాలు సందడే సందడి. అతని మాటలు, సరసోక్తులూ అందర్నీ ఖుషీ చేస్తాయి. "పూర్వగాథాలహరి" లాగా ఎన్నెన్నో కథలు హరికథలా చెప్తాడు. ప్రక్క డిపార్ట్‌మెంట్ మేష్టార్లు కూడా వచ్చి చెవులు కోసుకుని మరీ వింటారు. ఆ కథల్లో ఎక్కువగా 'సెక్స్' విషయాలుంటాయి. అందుకే కొందరు లోపల సంతోషించినా పైకి "ఎందుకా బూతు పురాణం" అంటూ ఆముదం తాగిన ముఖం పెడతారు. కుర్రకారుకి మాత్రం విహారి కథలు "వయాగ్రా"లా పని చేస్తాయనుకోండి.

ఒకరోజు ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి ఒక రీసెర్చ్ స్కాలర్ వచ్చింది. వచ్చి వచ్చి విహారి 'కంట్లో' పడింది. ఆ తర్వాత నోట్లో పడక తప్పదు గదా! ఆ అమ్మాయి వెళ్ళిన తర్వాత..."ఈ అమ్మాయి గైడు నా క్లాస్ మేట్. వాడు సామాన్యుడు కాదు" అన్నాడు విహారి.

"అంటే..." ఏం చెప్తాడో వినాలని ఒక మేష్టారి ఆత్రుత.

"ఏముందీ ఈ అమ్మాయికి డాక్టరేట్ గ్యారంటీ. వాడు ఇటువంటి వాళ్ళని అలాగ్గా బుట్టలో వేసుకుంటాడు. అదీ కథ" అన్నాడు.

"అతగాడు సరేనయ్యా...ఈ అమ్మాయి అటువంటిదేనని గ్యారంటీ ఏమిటటా" టెన్షన్ భరించలేని మరో మేష్టారి ప్రశ్న.

"ఆ అమ్మాయి వేషధారణని గమనించలేదా? పైగా మన రావుగారిని ఎలా చూసిందనుకున్నారు..."

"కొరుక్కుతినేలా..." మరో మేష్టారు పూర్తి చేశాడు.

"ఎగ్జాక్ట్‌లీ... రావుగారి చేతికి చెయ్యిని తాకించడం వంగడం, ఆ నవ్వులు...ఆ హొయలు...ఇంకేం కావాలి సాక్ష్యాలు" తనదైన పంథాలో విశ్లేషించాడు.

"నేను అప్పుడే అనుకొన్నాను స్మీ..." అని రావుగారు వత్తాసు పలికారు.

# పెద్దల మాట మన ప్రయత్నం



ఎంత కష్టమైన పనినైనా మనం మొదలుపెట్టేటప్పుడు, ఆ పని మనకు సానుకూలం అవుతుందనే భావించుకుని, మొదలుపెట్టాలి. శాయశక్తులా ప్రయత్నించినా, ఒకవేళ, పని సానుకూలపడకపోతే, మన ప్రయత్నలోపం లేదని తృప్తి చెందడం ఉత్తమం. ఏ పనికైనా ప్రయత్నిస్తూవుండడమే శుభాల్ని తెస్తుంది-అంటే, మన పని నెరవేరుతుంది. అందరికీ తెలిసిన కథే-అయినా అప్రస్తుతం కాదు కాబట్టిచెప్తాను.

యుద్ధంలో ఓడి, ఒక కొండ గుహలో దాక్కున్న ఒక రాజు, ఆ గుహలో తన గూడు ఏర్పరచుకోవటానికి ఎన్నిసార్లు కింద పడ్డా, మళ్లీ లేస్తూ, దారాలు అల్లుకుంటూ, చిట్టచివరికి సఫలమైన ఒక సాలెపురుగును చూసి, దానిలాగా పట్టుదల పెంచుకుని మళ్లీ రాజ్యం సంపాదించుకున్నాడు.

ఈ పైన చెప్పిన మాటలనే ఎంతో అందంగా భాసుడు అనే సంస్కృతమహాకవి ఇట్లా చెప్పాడు-

**యత్నే కృతే యది న సిద్ధ్యతి కోఽత్ర దోషః**
**కోవా న సిద్ధ్యతి మమేతి కరోతి కార్యం।**
**యత్నైః శుభైః పురుషతా భవతీహన్బూణాం**
**దైవం విధానమనుగచ్ఛతి కార్యసిద్ధిః॥**

మానవప్రయత్నానికి దైవబలం కూడా తోడైతే, అది పని పూర్తి కావటానికి అనుకూలతను కలుగజేస్తుంది.

ఎస్.వి. అప్పారావు ('లలితస్వర')

"ఏమండీ...విహారిగారు చెప్పే కథలన్నీ నిజమేనంటారా..."సంప్రదాయ సాహిత్యం బాగా చదువుకున్న యాజులుగారు రావుగారిని అడిగారు.

"అతనివి నమ్మేట్టుగానే వుంటాయి మరి. లేకపోతే అంత కరాఖండిగా ఎలా చెప్తాడండీ" అని జడ్జిమెంట్ ఇచ్చారు రావుగారు.

ఒకసారి విహారి నేనూ ఈవెనింగూ వాకింగ్‌కి వెళ్తున్నాం. ఒక డాబామీద ఒకావిడ పచార్లు చేస్తూ మా వంకే చూస్తోంది.

"ఆవిడ క్యారెక్టర్ అర్థమైందా?" అన్నాడు విహారి.

"ప్రతి ఆడదాన్ని అలా విశ్లేషించడం ఏం బాగోలేదురా. ఎవరూ పచార్లూ చెయ్యకా, ఎవరివంకా చూడకా, మల్లె పూలు పెట్టుకోకా...ఎలా ఉంటారు? ప్రతిదానికీ ఏదో భావం లాగుతావ్" అని చిరుకోపం ప్రదర్శించాను.

"నీవంటి వంటింటి గోరువంకలు అలాగే అనుకుంటారు. లోకం సంగతి తెలీదు. మన కావ్యాలను అర్థం చేసుకుంటే, సైకాలజీ చదివితే ఇలా మాట్లాడవు. సెక్స్ కోరిక మగవాళ్ళ కంటే ఆడవాళ్ళకే ఎక్కువని నిర్ధారించారు. అయితే వాళ్ళు బయటపడరు. అయినా బయటపడని లక్షణాలుంటాయి. వాటినే నేను చెప్తున్నాను" అని ఓ క్లాస్ తీసుకుంటూ వుంటే...

"ఇంతకీ నీ ఎసెస్‌మెంట్ ఏమిటో చెప్పు" అన్నాను.

"నైటీ వేసుకొని జుట్టూ విరబోసుకొని అలా పచార్లు చేస్తుంటే వాళ్ళ ఆయన లేరని సిగ్నల్. సెక్స్ కోరికలు ఎక్కువని భావం" అని సిద్ధాంతీకరించాడు. "వాడంతేలే" అని మౌనం వహించాను.

మరోసారి నేనూ విహారి కలిసి ఏబిడ్స్‌కి షాపింగ్‌కి వెళ్ళాం. నేను షాపు బయటనుంచొని ఒకావిడను చూస్తున్నాను. ఇంతలో విహారి వచ్చి "ఇక్కడున్నావేంట్రా. లోపలికి రా" అన్నాడు. "కాదులే, నేను కూడా ఒకావిడని చదువుతున్నాను" అన్నాడు.

"సెభాష్...ఇన్నాళ్ళకు నా దారిలోకి వచ్చినందుకు గర్వంగా వుందిరా...అలావుండాలి...ఎవరు చూపించు" అన్నాడు సంబరంతో విహారి.

"అదిగో ఆకుపచ్చ చీర కట్టుకుంది...పసిపాపను ఎత్తుకొని నుంచుంది. చూశావా..ఆవిడే" అన్నాను.

"ఆవిడా...ఏమనుకుంటున్నావ్" అన్నాడు నిదానంగా.

"ఇందాకటినుంచి చూస్తున్నాను...ఆ పసిపాపను ఒకటే ముద్దుల్తో ముంచెత్తుతోంది. అంటే అర్థం...ముద్దులకి తపించిపోతోందన్నమాట. అందరికీ 'షో' చేస్తోందన్నమాట" అన్నాను.

"అదేంకాదురా...పసిపాపను ఎవరైనా ముద్దుపెట్టుకుంటారు" విహారి నోట్లోంచి ఈ డైలాగు రావటం ఇదే మొదటిసారి.

"నేను బాగా అబ్జర్వ్ చేస్తున్నాను. నేను చూస్తుంటే ఇంకా ఎక్కువ ముద్దులు పెడుతోంది. అంటే సెక్స్ కోరిక ఎక్కువన్న మాట. కొంపతీసి నాకు గాని లైన్ వేస్తోందా ఏమిటి?"

"నోర్ముయ్ వెధవా! ఆవిడ అటువంటిది కాదు" విహారిలో అంత కోపాన్ని చూడటం అదే మొదటిసారి.

"అదేమిట్రా...నీకెలా తెలుసు?"

"నీ మొహం...అది నా భార్య" అన్నాడు తల వంచుకొని.

■